పంత్, గిల్ గర్జన

సూపర్ సెంచరీలతో విజృంభణ

భారత్ రెండో ఇన్నింగ్స్ 287/4 డిక్లేర్డ్

బంగ్లా లక్ష్యం 515, ప్రస్తుతం 158/4

భారత యువ కిషోరాలు శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్..బంగ్లాదేశ్‌పై గర్జించారు. భవిష్యత్ ఆశాకిరణాలుగా భావిస్తున్న ఈ ఇద్దరు.. బంగ్లాపై సూపర్ సెంచరీలతో కదంతొక్కారు. ఘోర రోడ్డు ప్రమాదంలో కొరి ప్రాణంతో బయటపడి మైదానంలో మళ్లీ అడుగుపెట్టిన పంత్ టెస్టుల్లో తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. చిదంబరం స్టేడియంలో బంగ్లా బౌలర్లను ఉతికి ఆరేస్తూ శతకంతో విరుచుకుపడ్డాడు. తన ట్రేడ్‌మార్క్ షాట్లతోఅభిమానులను అలరిస్తూ కెరీర్‌లో ఆరో సెంచరీ ఖాతాలో వేసుకుంటూ దిగ్గజ ధోనీతో సమంగా నిలిచాడు. తానేం తక్కువ కాదన్నట్లు గిల్ కూడా ఆకాశమే హద్దుగా చెలరేగడంతో బంగ్లా బౌలర్లు చేష్టలుడిగిపోయారు. వీరిద్దరి శతక విజృంభణతో బంగ్లా ముందు 515 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. మరో రెండు రోజులు మిగిలున్న మ్యాచ్‌లో 4 వికెట్లు కోల్పోయిన బంగ్లా 158 పరుగులతో కొనసాగుతున్నది. టీమ్‌ఇండియా బౌలర్లు జూలు విదిలిస్తే..బంగ్లాదేశ్ ఖేల్ ఖతమైనట్లే.

చెన్నై: సొంతగడ్డపై తమకు తిరుగులేదని భారత్ మరోమారు చేతల్లో చూపెడుతున్నది. ప్రత్యర్థి ఎవరైనా తమ వ్యూహాల్లో తేడా ఉండదని సిరీస్‌కు ముందే హెచ్చరించిన కెప్టెన్ రోహిత్ శర్మ..అందుకు తగ్గట్లు బంగ్లాదేశ్‌కు ఉచ్చు బిగిస్తున్నాడు. టీమ్‌ఇండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తున్న వేళ తొలి టెస్టుపై పూర్తి పట్టు సాధించింది. భారత్ నిర్దేశించిన 515 పరుగుల లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఓపెనర్లు జాకీర్ హసన్(33), షాద్మన్(35) మెరుగైన శుభారంభం అందించగా, కెప్టెన్ నజ్ముల్(51 నాటౌట్) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. అశ్విన్(3/63) మూడు వికెట్లు తీసి జోరు మీదున్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 81/3తో మూడో రోజు శనివారం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన టీమ్‌ఇండియా..గిల్(176 బంతుల్లో 119 నాటౌట్, 10ఫోర్లు, 4సిక్స్‌లు), పంత్(128 బంతుల్లో 109, 13ఫోర్లు, 4సిక్స్‌లు) సెంచరీలతో విజృంభించారు. బంగ్లా బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ వీరిద్దరు రాణించడంతో 287 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. మెహదీహసన్(2/103) రెండు వికెట్లు దక్కాయి.

గిల్, పంత్ మోత

యువ క్రికెటర్లు గిల్, పంత్..చెన్నై చిదంబరం స్టేడియంలో పరుగుల వరద పారించారు. బంగ్లా బౌలర్లను సులువుగా ఎదుర్కొంటూ దూకుడుగా ఆడే ప్రయత్నం చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన గిల్..తన విలువ చాటుకున్నాడు. ఎక్కడా చెత్త షాట్లకు పోకుండా ఇన్నింగ్స్ కొనసాగించాడు. స్పిన్నర్ మెహదీ హసన్ బౌలింగ్‌లో సిక్స్‌తో గిల్ 50 పరుగుల మార్క్ అందుకున్నాడు. మరో ఎండ్‌లో పంత్..గిల్‌కు చక్కని సహకారం అందించాడు. తొలి సెషన్‌లో వికెట్ కోల్పోకుండా జాగ్రత్తపడ్డ ఈ ఇద్దరు భారీ ఇన్నింగ్స్‌కు రూపకల్పన చేశారు. ఓవైపు మంచి బంతులను గౌరవిస్తూనే చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేశారు. అయితే షకీబ్ అల్‌హసన్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన పంత్..72 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కెప్టెన్ నజ్ముల్ క్యాచ్ విడిచిపెట్టడంతో లైఫ్ దక్కించుకున్నాడు. ఇక అక్కణ్నుంచి మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. గిల్ ఒకింత నెమ్మదించగా, పంత్ టాప్‌గేర్‌లో దూసుకెళ్లాడు. బౌండరీలతో ఆకట్టుకున్నాడు. షకీబ్ బౌలింగ్‌లో 124 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఈ క్రమంలో పంత్ ఒకింత భావోద్వేగానికి గురయ్యాడు. ఆకాశం వైపు తదేకంగా చూస్తూ అభిమానులకు అభివాదం చేశాడు. మెహదీ వేసిన మరుసటి ఓవర్‌లోనే అతనికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి పంత్ వెనుదిరిగాడు. ఆ తర్వాత గిల్ సెంచరీ మార్క్ అందుకోగా, రాహుల్(22) నాటౌట్‌గా నిలిచాడు

బంగ్లా 158/4:

భారీ లక్ష్యఛేదనలో బంగ్లాకు మెరుగైన శుభారంభమే దక్కింది. ఓపెనర్లు జకీర్, షాద్మన్ ఆకట్టుకున్నారు. మిడిలార్డర్‌లో కెప్టెన్ నజ్ముల్ అర్ధసెంచరీతో రాణించాడు. అశ్విన్(3/63) రాణించడంతో బంగ్లా నాలుగు వికెట్లు కోల్పోయింది. వెలుతురు లేమి కారణంగా అంపైర్లు మ్యాచ్‌ను ముందుగానే నిలిపివేశారు.

పంత్ ప్రణామ్..!

రోడ్డు ప్రమాదం నుంచి బయటపడి తిరిగి బంగ్లాదేశ్‌పైనే టెస్టుల్లో పునరాగమనం చేసిన పంత్ మూడో రోజు ఆటలో భావోద్వేగంతో కనిపించాడు. రెండో సెషన్‌లో మైదానంలోకి దిగే ముందుకు తన బ్యాట్, హెల్మెట్, గ్లౌసెస్‌కు మొక్కాడు. మరోవైపు తాను బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బంగ్లా కెప్టెన్ నజ్ముల్‌కు పంత్ సూచనలు ఇవ్వడం లైవ్‌లో రికార్డయ్యింది. ఇక్కడ ఒక ఫీల్డర్‌ను పెట్టమంటూ చెప్పడం నవ్వులు తెప్పించింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 376 ఆలౌట్, బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 149 ఆలౌట్, భారత్ రెండోఇన్నింగ్స్: 287/4 డిక్లేర్డ్(గిల్ 119 నాటౌట్, పంత్ 109, మెహదీ 2/103), బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: 158/4 (నజ్ముల్ 51 నాటౌట్, షాద్మన్ 35, అశ్విన్ 3/63)

జాతీయ సాహస శిబిరానికి మల్లాపూర్ విద్యార్థులు

తిమ్మాపూర్ రూరల్, సెప్టెంబర్ 21: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. చదువుతున్నది ప్రభుత్వ పాఠశాల అయినా ప్రతిభ కొదువలేదని చేతల్లో చూపించారు. హర్యానా వేదికగా అక్టోబర్ 6 నుంచి 10వ తేదీ వరకు నేషనల్ యూత్ అడ్వెంచర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జరిగే జాతీయ సాహస కృత్యాల శిబిరానికి 10 మంది మల్లాపూర్ వి ద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం ఉమారాణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాహస కృత్యాలు నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ మరింతగా పెంపొందుతాయని ఆమె అన్నారు. ఈ శిబిరంలో విద్యార్థులు రాఫెలింగ్, మౌంటెనీరింగ్, రివర్‌క్రాసింగ్ వంటి భిన్నమైన సాహస విన్యాసాల్లో పాల్గొంటారని తెలిపారు. శిబిరానికి ఎంపికైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స మావేశం నిర్వహించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మధుసూదనాచా రి, స్కూట్ జిల్లా కార్యదర్శి రాంరెడ్డి పాల్గొన్నారు.

అఫ్గన్ అద్భుతం

- **దక్షిణాఫ్రికాపై తొలిసారి వన్డే సిరీస్ సొంతం**
- **రెండో వన్డేలో అఫ్గన్ ఘన విజయం**
- **గుర్బాజ్, రషీద్ విజృంభణ**

షార్జా: అంతర్జాతీయ క్రికెట్‌లో తాము ఎంత మాత్రం పసికూనలం కాదని అఫ్గానిస్థాన్ జట్టు నిరూపించింది. శుక్రవారం అర్ధరాత్రి ముగిసిన రెండో వన్డేలో అఫ్గన్ 177 పరుగులతో దక్షిణాఫ్రికాపై చారిత్రక విజయం సాధించింది. తద్వారా సఫారీలపై తొలి వన్డే సిరీస్‌ను దక్కించుకుని తమ సత్తాఏంటో ప్రపంచానికి చాటిచెప్పింది. తొలుత రహ్మనుల్లా గుర్బాజ్ (105) సూపర్ సెంచరీకి తోడు అజ్మతుల్లా ఒమర్జాయ్(86 నాటౌట్), రెహమత్ షా(50) అర్ధసెంచరీలతో అఫ్గన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 311/4 భారీ స్కోరు చేసింది. 88 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయిన అఫ్గన్‌ను ఒమర్జాయ్, రెహమత్‌షా ఆదుకున్నారు. వీరిద్దరు సఫారీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ రెండో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ముఖ్యంగా ఒమర్జాయ్ తన ఇన్నింగ్స్‌లో 10ఫోర్లు, మూడు భారీ సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. గుర్బాజ్ తర్వాత క్రీజులోకొచ్చిన అజ్మతుల్లా దూకుడు కనబరిచాడు. 5ఫోర్లు, 6సిక్స్‌లతో సఫారీలపై విరుచుకుపడటంతో స్కోరు 300 మార్క్ అందుకుంది. ఎంగ్డీ, బర్గర్, పీటర్, మార్క్‌రమ్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 34.2 ఓవర్లలో 134 పరుగులకు కుప్పకూలింది. స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్(5/19) ధాటికి సఫారీ బ్యాటర్లు చాపచుట్టేశారు. ఓవైపు గాయం వేధిస్తున్నా..రషీద్ తన స్పిన్ నైపుణ్యంతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు. కెప్టెన్ బవుమా(38) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. రషీద్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

లంక, కివీస్ టెస్టుకు బ్రేక్

కొలంబో: శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న తొలి టెస్టుకు బ్రేక్ పడింది. ఇప్పటికే మూడు రోజుల ఆట ముగిసిన టెస్టులో నాలుగో రోజైన శనివారం విరామం ప్రకటించారు. తొలుత షెడ్యూల్‌లో ప్రకటించినట్లే మూడు రోజుల తర్వాత మ్యాచ్‌కు విరామమిచ్చారు. శనివారం శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఇలా బ్రేక్ ఇచ్చినట్లు ఆ దేశ క్రికెట్ బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. ఆదివారం, సోమవారం మిగిలిన రెండు రోజుల ఆట కొనసాగనుంది.

ఇండియా 'డీ'కి భారీ ఆధిక్యం

అనంతపూర్: దులీప్ ట్రోఫీలో ఇండియా 'బీ', 'డీ' జట్ల మధ్య రసవత్తర పోరు జరుగుతున్నది. రికీ భుయ్(90 నాటౌట్), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(50) అర్ధసెంచరీలతో ఇండియా 'డీ' రెండో ఇన్నింగ్స్‌లో 244/5 స్కోరు చేసింది. భుయ్ బాధ్యాయత ఇన్నింగ్స్‌తో రాణించాడు. ముకేశ్ (3/80) ఆకట్టుకున్నాడు. ఇండియా 'డీ' ప్రస్తుతం 311 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది. ఓవర్‌నైట్ స్కోరు 210/6తో తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఇండియా 'బీ' 282 కు ఆలౌటైంది.

ఎఫ్ఐహెచ్ అవార్డు రేసులో హర్మన్‌ప్రీత్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక ఎఫ్ఐహెచ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకు భారత హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్ నామినేట్ అయ్యాడు. ఇటీవలే పారిస్ ఒలింపిక్స్‌లో అద్భుత ప్రదర్శనతో దేశానికి కాంస్య పతకం అందించడంలో హర్మన్ కీలకమయ్యాడు. ఆడిన 8 మ్యాచ్‌ల్లో 10 గోల్స్ ద్వారా టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. వరుసగా రెండో ఒలింపిక్స్‌లో భారత్‌కు కాంస్య పతకం దక్కేలా చేశాడు. 2024 అవార్డు కోసం హర్మన్‌ప్రీత్‌సింగ్‌తో పాటు నెదర్లాండ్స్‌కు చెందిన థియరీ బ్రింక్‌మన్, జోప్ డెమోల్, హన్నెస్ ముల్లర్(జర్మనీ), జాక్ వాలెస్(ఇంగ్లండ్) పోటీపడుతున్నారు. ఈ ఏడాది జరిగిన వివిధ టోర్నీల్లో ప్రదర్శన ఆధారంగా ప్లేయర్లను అవార్డుకు నామినేట్ చేశారు. వచ్చే నెల 11 వరకు అవార్డు విజేతను నిర్ణయించేందుకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగనుంది.

సెమీస్‌లో విజయ్, జీవన్ జోడీ

న్యూఢిల్లీ: చైనా వేదికగా జరుగుతున్న హంగ్జు ఓపెన్‌లో భారత టెన్నిస్ ద్వయం విజయ్‌సుందర్ ప్రశాంత్, జీవన్ నెదున్‌చెజియాన్ జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో విజయ్, జీవన్ ద్వయం 6-7(4), 7-6(6), 10-8తో రెండో సీడ్ జంట జులియన్ కాష్, లాయిడ్ గ్లాస్‌పూల్‌పై విజయం సాధించింది. తొలి సెట్‌ను ప్రత్యర్థి చేజార్చుకున్నా..పుంజుకుని పోటీలోకి వచ్చిన భారత్ జోడీ వరుస సెట్లలో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు ఆపండి!

- **గ్రూప్-1పై హైకోర్టులో 14కు పైగా కేసులు**
- **కేసులు తేలాకే నిర్వహించాలి**
- **మెయిన్స్ తర్వాత తీర్పులొస్తే అమలు ఎలా?**
- **రాష్ట్ర ప్రభుత్వానికి అభ్యర్థుల వినతి**
- **ఎన్టీఆర్ స్టేడియంలో సమావేశం**
- **హైకోర్టు సీజే అలోక్ అరాధేకు లేఖలు రాయాలని నిర్ణయం**

హైకోర్టు సీజేకు లేఖలు రాసేందుకు ఎన్టీఆర్ స్టేడియంలో సమావేశమైన నిరుద్యోగులు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): 'గ్రూప్ 1పై 14కు పైగా కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు ఉన్నాయి. పరీక్షల అనంతరం కోర్టు తీర్పులొస్తే ఎలా అమలు చేస్తారు. అందుకే తీర్పుల అనంతరమే పరీక్షలు నిర్వహించాలి' అని అభ్యర్థులు కోరుతున్నారు. కేసులు కొలిక్కి వచ్చేవరకు పరీక్షలను నిర్వహించొద్దని కోరుతున్నారు. ఈ అంశంపై శుక్రవారం అభ్యర్థులు ఎన్టీఆర్ స్టేడియంలో పెద్ద ఎత్తున సమావేశమయ్యారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ సంతకాలు సేకరించి హైకోర్టు చీఫ్ జస్టీస్ అలోక్ అరాధేకు విన్నవించుకోవాలని అభ్యర్థులు నిర్ణయించారు. గ్రూప్-1పై పెండింగ్‌లో ఉన్న కేసులు హైకోర్టు ధర్మాసనం ముందు విచారణ జరుగుతుండగా పరీక్షలెలా నిర్వహిస్తారని అభ్యర్థులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఒకవేళ మెయిన్స్ పరీక్షలు నిర్వహించిన తర్వాత తీర్పులొస్తే అమలు ఎలా అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 9న జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు 3.02 లక్షల మంది హాజరయ్యారు. వీరిలో మెయిన్స్ పరీక్షలకు 31,382 మంది అర్హత సాధించారు. వీరికి అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించాల్సి ఉన్నది. గ్రూప్-1పై ప్రస్తుతం పలు కేసులు హైకోర్టులో విచారణ జరుగుతున్నాయి. హరి జాంటల్ రిజర్వేషన్లపై వేసిన పిటిషన్ నవంబర్ 7న, ఫైనల్ కీపై, జీవో-29పై వేసిన కేసులు ఈ నెల 27 విచారణకు రానున్నాయి. స్థానికతపై వేసిన పిటిషన్ కేసు అక్టోబర్ 3న విచారణకు రానున్నది. ఆయా కేసులు తేలాకే మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలన్నది అభ్యర్థుల ప్రధాన డిమాండ్.

గ్రూప్-1పై వివిధ కేసుల వివరాలు?

- ప్రాథమిక కీపై 1,712 మంది అభ్యర్థుల నుంచి 6,417 అభ్యంతరాలు వచ్చాయి. నిపుణుల కమిటీ సూచనల మేరకు మాస్టర్ క్వశ్చన్ పేపర్‌లో 56, 59 ప్రశ్నలను తొలగించారు. 115వ ప్రశ్నకు సమాధానంగా ఆప్షన్ 2 నుంచి 1 సరైన సమాధానంగా మార్చారు. అయితే అభ్యర్థులు మొత్తం 13 ప్రశ్నల సమాధానాలపై అభ్యంతరాలు లేవదీశారు. 35, 41, 45, 59, 64, 66, 67, 79, 95, 106, 116, 119, 139వ ప్రశ్నలపై అభ్యంతరాలను వ్యక్తంచేస్తూ కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ అంశంపై కోర్టులో విచారణ జరుగుతున్నది.
- గ్రూప్-1 నోటిఫికేషన్‌లో తొలుత 503 పోస్టులను విడుదల చేయగా, కొత్తగా వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు మరో 60 పోస్టులను కలిపి కొత్త నోటిఫికేషన్‌ను జారీచేసింది. దీంతో కొత్తగా 1.71 లక్షల మంది రెండోసారి దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. తొలుత దరఖాస్తు చేసిన వారికి 503, రెండోసారి నోటిఫికేషన్ జారీచేసిన 60 పోస్టులకు కొత్త, పాత వారందరికీ వర్తింపజేయాలని హైకోర్టును ఆశ్రయించారు.
- జీవో 29ని సవాల్ చేస్తూ మరో కేసు కోర్టులో నడుస్తున్నది. ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్ల వర్తింపు సహా పలు రిజర్వేషన్లపై వివిధ కేసులు ఉన్నాయి. జీవో 55 కేసుపై తుది తీర్పు రానేలేదు.
- ఎస్టీ రిజర్వేషన్లు 6 నుంచి 10 శాతానికి పెంచడంపైనా కోర్టులో కేసు నడుస్తున్నది. ఈ అంశంపై అక్టోబర్ 14న తీర్పు వచ్చే అవకాశం ఉన్నది.
- పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసే అవకాశం లేదని, ఎలా రద్దు చేస్తారని అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టులో మరో కేసు వేశారు.
- మొత్తం పోస్టులకు కాకుండా ఓపెన్ క్యాటగిరీ పోస్టుల్లోనే 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను వర్తింపజేయాలని హైకోర్టులో కేసు నడుస్తున్నది. మధ్యప్రదేశ్ హైకోర్టు సింగింగ్ బెంచ్ ఇదే తీర్పు ఇవ్వగా ఈ తీర్పును మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని అభ్యర్థులు పిటిషన్ దాఖలు చేశారు.
- స్పోర్ట్స్ కోటా పోస్టులకు జాతీయస్థాయిలో ఆడిన క్రీడాకారులను సైతం అనుమతించాలని ఇటీవలే హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ పోస్టులకు 198 మందిని పికప్ చేయాల్సి ఉండగా, 8 వేల మంది సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇది ఇప్పట్లో సాధ్యమా? అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

టెట్‌పై సస్పెన్స్!

- **డిసెంబర్‌లో జీవో ఇచ్చిన సర్కారు**
- **జాబ్ క్యాలెండర్‌లో జనవరి అని ప్రకటన**
- **ప్రభుత్వంలో లోపించిన సమన్వయం**

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): టెట్ షెడ్యూల్ విషయంలో స్పష్టత కొరవడింది. ప్రభుత్వమే పరస్పర విరుద్ధమైన ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వంలో సమన్వయం కొరవడింది. టెట్‌ను ఏటా రెండుసార్లు నిర్వహిస్తామని, జూన్‌లో ఒకసారి, డిసెంబర్‌లో మరోసారి నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం జీవో 18ను విడుదల చేశారు. జూలై 5న జీవోను విడుదల చేయగా, ఆగస్టు 3న ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌లో టెట్‌ను జనవరి 2025లో నిర్వహిస్తామని ప్రకటించింది. ఈ ఏడాది నవంబర్‌లోనే టెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పింది. నెలరోజుల వ్యవధిలోనే డిసెంబర్‌లో అని జీవో, జనవరిలో అని జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించడంతో సందిగ్ధత నెలకొన్నది. సాక్షాత్తు ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక ఉత్తర్వుల్లో పరస్పర విరుద్ధంగా ఉంటే ఎలా అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. టెట్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరుతున్నారు.

రేషనలైజేషన్ జీవోను మార్చాలి: యూఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): రేషనలైజేషన్ జీవో-25 నిబంధనలు మార్చాలని, అశాస్త్రీయమైన టీచర్ల సర్దుబాటును నిలిపివేయాలని యూఎస్‌పీఎస్సీ ప్రకటనలో కోరింది. ప్రాథమిక పాఠశాలల్లో 11 మందికి ఇద్ద రు, 60 మందికి ఇద్దరు టీచర్లను కేటాయించాలని పేర్కొనడం అసంబద్ధమని పేర్కొంది. డీఎస్సీ నియామకాలు జరగాల్సిన తరుణంలో సర్దుబాటు చేయడాన్ని బట్టి ఇప్పట్లో నియామకాలు చేపట్టే ఉద్దేశ్యం లేదా? అని ప్రశ్నించింది.

పదోన్నతులు, బదిలీలు చేపట్టండి: టీజీవో

హైదరాబాద్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): రెవెన్యూశాఖలో పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని టీజీవో ప్రభుత్వాన్ని కోరింది. టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎనుగుల సత్యనారాయణ, శ్యామ్, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్స్.. జీఆర్ఎల్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ విభాగంలోని డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్స్ (గ్రేడ్ -2 జనరల్ ర్యాంకింగ్ లిస్టు(జీఆర్ఎల్)ను టీజీపీఎస్సీ శనివారం విడుదల చేసింది. జీఆర్ఎల్‌తోపాటు ఫైనల్ కీని సైతం విడుదల చేసింది. జూన్ 30, జూలై 4న డీఏవో ఉద్యోగాల భర్తీకి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌ను నిర్వహించారు. జూలై 31న ప్రాథమిక కీని విడుదల చేయగా, తాజాగా శనివారం ఫైనల్‌కీతోపాటు జనరల్ ర్యాంకింగ్ లిస్టును వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

టైం టేబుల్ మార్చండి: పీఆర్‌జీటీఏ

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): గురుకుల పాఠశాలలు, కళాశాలల టైం టేబుల్‌ను మార్చాలని పీఆర్‌జీటీఏ ప్రభుత్వాన్ని కోరింది. పీఆర్‌జీటీఏ ప్రతినిధులు శనివారం సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. 010 పద్దుద్వారా జీతాలు చెల్లించాలని, పదోన్నతులు కల్పించాలని, సీసీఎల్ మంజూరు, కేర్ టేకర్ల నియామకం, డిగ్రీకాలేజీలను ఏర్పాటుచేయాలని కోరారు. పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌రెడ్డి, నిర్మలానందం, విద్యాసాగర్, రమేశ్, విజయ్‌కుమార్, చెల్క సంజీవరెడ్డి వినతిపత్రాన్ని సమర్పించారు.

స్కూల్‌గ్రాంట్ విడుదలపై హర్షం

ప్రభుత్వ, పంచాయతీరాజ్, కేజీబీవీ, ఆదర్శపాఠశాలలకు స్కూల్ గ్రాంట్, స్పోర్ట్స్ గ్రాంట్‌ను విడుదల చేయడంపై పీఆర్టీయూటీఎస్ హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ప్రకటనలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏజెన్సీతో వద్దు..

నేరుగా జీతాలు చెల్లించండి

ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం గల ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వం ద్వారానే జీతాలు చెల్లించాలని తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నేరుగా ప్రభుత్వం, కార్పొరేషన్ ద్వారా వేతనాలను అందించాలని ప్రకటనలో కోరింది. జేఏసీ అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, ఉపాధ్యక్షుడు శ్రీధర్ శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రతి నెలా 5లోపు వేతనాలు అందించాలని, హెల్త్‌కార్డులు మంజూరుచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సెలవులను 30కి పెంచాలని కోరారు.

కంగన రనౌత్‌కు సమన్లు

న్యూఢిల్లీ: బాలీవుడ్ నటి, ఎంపీ కంగన రనౌత్‌కు ఉత్తర ప్రదేశ్‌లోని బులంద్‌షహర్ ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు సమన్లు జారీ చేసింది. వచ్చే నెల 25న కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా 2020-21లో జరిగిన రైతుల నిరసనలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు ఆమెపై నమోదైన కేసులో ఈ చర్య తీసుకుంది.

త్వరలో కొత్త పాఠ్యపుస్తకాలు

దశలవారీగా అందుబాటులోకి

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్(ఎన్సీఎఫ్)-2023 ప్రకారం విద్యాశాఖ కొత్త పాఠ్యపుస్తకాలను దశలవారీగా రూపొందించనున్నది. 2014 తర్వాత కేసీఆర్ సర్కారు హయాంలో పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేశారు. కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్(ఎన్సీఎఫ్)-2023 ఆధారంగానే కొత్త కరిక్యులం రూపొందించాల్సి ఉంది. ప్రస్తుతం తెలుగు, హిందీ, ఉర్దూ వంటి భాషలను మినహాయించి నాన్ లాంగ్వేజ్ సబ్జెక్టులకు కొత్త కరిక్యులాన్ని రూపొందించే అవకాశాలున్నాయి. ఆ తర్వాత భాషలకు సంబంధించిన కరిక్యులాన్ని సైతం మార్చనున్నారు.

ఎన్సీఎఫ్ సూచనలిలా..

- పాఠ్యప్రణాళికల్లో 20%స్థానిక, 30% ప్రాంతీయ, 30% జాతీయ, 20% అంతర్జాతీయ అంశాలుండాలి.
- కంఠస్థం, బట్టిపట్టే పద్ధతుల నుంచి విద్యార్థులను దూరంచేసేలా కరిక్యులాన్ని తయారుచేయాలి.
- 6 నుంచి 8వ తరగతి వరకు సామాజిక శాస్త్రాల బోధనకు థీమాటిక్ విధానం అవలంభించాలి. 9వ తరగతి తర్వాతే చరిత్ర, భూగోళం, ఆర్థికశాస్త్రం, రాజకీయశాస్త్రంగా విభజించాలి.
- పరీక్షలను సంస్కరించాలి. 10, 12 తరగతుల పరీక్షలను ఏడాదికి రెండుసార్లు నిర్వహించాలి.
- గణితం సమస్యా పరిష్కరణ దిశలో అమూర్త, తార్కిక ఆలోచన సామర్థ్యాలను పెంపొందించేలా ఉండాలి.
- సైన్స్, పర్యావరణం పాఠశాలజీవితంలో అంతర్భాగం కావాలి. సృ